క్లుప్తంగా

పూర్తిస్థాయిలో పూడిక తీయండి



పటమట(విజయవాడతూర్పు): నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న డిసిల్టింగ్ పనులను పూర్తిస్థాయిలో చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం హనుమాన్ పేటలోని వెహికల్ డిపో, రైల్వేస్టేషన్, జెండా చెట్టు, నైజాంగేట్, గాంధీ హిల్, కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్లను, ఎంజీ రోడ్, బీఆర్పీ రోడ్, నెహ్రూ రోడ్, లోబ్రిడ్జి ప్రాంతం, గణపతిరావు రోడ్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా రోజూ డిసిల్టింగ్ పనులు చేయాలని ఆదేశించారు. కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద ఎస్కలేటర్‌ను పెట్టి ఫ్లోటింగ్ గార్బేజ్‌ను త్వరితగతిన తీయించాలని, డ్రైన్‌పై స్లాబ్‌ని తీసేసి డిసిల్టింగ్ ప్రక్రియ సజావుగా చేసేందుకు గ్రిల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసునికి తులసీదళ అర్చన



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):చిట్టినగర్‌లో వేంచేసిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున ఆలయంలో స్వామి వారి ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రత్నమాచార్యులు శిష్యబృందం స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌ను తులసీ దళాలతో అలంకరించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు ఆలయానికి తరలివచ్చారు. సాయంత్రం స్వామి వారికి పంచహారతుల సేవ, ఏకాంత సేవలను నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో నృత్యార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్య కళాశాలకు చెందిన చిన్నారులు భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్యాచార్య రాయన శ్రీనివాసరావు పర్యవేక్షణలో 15 మందికి పైగా శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు.

సృజనకు ప్రాధాన్యమివ్వాలి

విజయవాడ కల్చరల్: రచన, సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలకు నిర్వాహకులు ప్రాధాన్యమివ్వాలని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, స్వచ్ఛాంధ్ర ఆధ్వర్యాన బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో 10 రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. నిర్వాహకులు బాల బాలికలకు చిత్రలేఖనం, వ్యాసరచన, గ్రంథాలను గుర్తించడం అంశంగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిథి కొల్లూరి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రంథాలయాలకు చెల్లించాల్సిన పన్నులను ఇవ్వాలన్నారు. గ్రంథాలను అందుబాటులో ఉంచాలని గురువులు, తల్లిదండ్రులు విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక నాయకులు గోళ్ల నారాయణరావు, ఎన్ఎస్ నాగిరెడ్డి, లక్ష్మయ్య, శిబిరం నిర్వాహకులు హసినా, ప్రసాద్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి దర్శనానికి శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వేసవి సెలవులతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలతో పాటు క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని సాయంత్రం వరకు మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

పాత ఆర్‌ఆర్‌పేటలో జ్వరాలు విజృంభణ



మెయిన్‌రోడ్డులో ప్రారంభమై నిలిచిపోయిన డ్రెయిన్ నిర్మాణ పనులు



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

- అస్తవ్యస్త డ్రెయినేజీతో ఇళ్లలోకి మురుగు
- దోమలు వృద్ధి చెంది జనం అవస్థలు
- పట్టించుకోని నగర పాలక సంస్థ

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): ఇటీవల కురుస్తున్న వర్షాలకు డ్రెయిన్లలో మురుగు పారుదల లేక ఎక్కడికక్కడ స్తంభించిపోతుంది. దీంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో పాత ఆర్‌ఆర్‌పేటలోని ఏ వీధిలో చూసినా పొంగి పొర్లుతున్న డ్రెయిన్లే దర్శనమిస్తున్నాయి. మహంకాళమ్మగుడి వీధి, సాయిబాబా గుడి, బీరువాల కంపెనీ రోడ్డు, మెయిన్ రోడ్డులో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ పేటలో ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పూడిక తొలగించకపోవడంతో డ్రెయిన్‌లలోని మురుగు రోడ్లపై పారుతుందని స్థానికులు చెబుతున్నారు. ఒక పక్క కురుస్తున్న వర్షాలతో పాటు డ్రెయిన్‌లు పొంగిపొర్లుతుండటంతో మురుగు నీరు రోడ్లపై నుంచి ఇళ్ల మధ్యకి చేరుతుందని ఆందోళన చెందుతున్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో వర్షపు నీరు నిలిచి దోమలు పెరగటానికి మరో కారణంగా మారిందని అంటున్నారు.

జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు....

డివిజన్‌లోని అనేక వీధుల్లో ప్రజలు జ్వరాలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అధిక శాతం మంది నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు నివాసముంటారని, వీరంతా అనారోగ్యంపాలై తాము సంపాదించి దాచుకున్నదంతా ఆసుపత్రులకు ఖర్చు పెట్టాల్సి వస్తుందని స్థానిక మహిళలు తమ బాధలను వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం లేస్తే కూలీ పనులకు వెళ్లి వచ్చే తాము అనారోగ్యం పాలవటంతో కుటుంబం గడవడమే కష్టంగా మారుతుందని కన్నీరుమున్నీరవుతున్నారు. నగర పాలక సంస్థ సిబ్బంది తమ ప్రాంతం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రెయిన్‌లను శుభ్రపర్చి మురుగు నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసకోవాలని కోరుతున్నారు.

పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు....

డివిజన్‌లో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నా నగర పాలక సంస్థ సిబ్బంది పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. మలేరియా సిబ్బంది ఇంటింటికి వచ్చి వివరాలు సేకరించాల్సి ఉన్నా కంటికి కనిపించకుండా పోయారని ధ్వజమెత్తారు. డివిజన్‌లో శానిటరీ వ్యవస్థ ఉందో లేదో అర్థంకాని పరిస్థితిలో ఉన్నామని స్థానికులు అంటున్నారు.

ఇంటికొకరు జ్వరంతో బాధపడుతున్నారు



పాత ఆర్‌ఆర్‌పేటలో ఏ వీధిలో చూసినా ఇంటి కొకరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైందని తెలిసినా నగరపాలకసంస్థ అధికారులు పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

– గోవింద్, స్థానికుడు

ఆనందమయ జీవితానికి యోగా దోహదం

భవానీపుర(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం (జువెనైల్ హోమ్)లోని బాలురకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. దత్త క్రియ యోగా సెంటర్ సహకారంతో కేబీఎన్ కళాశాలలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్లు యోగాపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేబీఎన్ కాలేజి వ్యాయామ అధ్యాపకులు డి.హేమచంద్రరావు యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఆరోగ్యకరమైన ఆనందమయ జీవితానికి యోగాసనాలు దోహదం చేస్తాయని తెలిపారు. నాడీ శుద్ధి వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర అంశాలపై ఎన్.సాంబశివరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని ఎస్కేపీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ వి.నారాయణరావు, కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను ఒక భాగం చేసుకోవాలని సూచించారు. తద్వారా శారీరక, మానసిక రోగాలు దూరం కావడమే కాకుండా ఫిట్‌నెస్‌కు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డి. పవన్‌కుమార్, ఎం.శాంతిబాబు, పి.గౌతమి దేవి సమన్వయం చేశారు. జువెనైల్ హోమ్ సూపరింటిండెంట్ పి.రామ్మోహన్‌రెడ్డి, ఇన్‌టేక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ ఎం.అలీ హుస్సేన్ బేగ్, జిల్లా ఇనిస్టిట్యూషన్ కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మహా పూర్ణాహుతితో ముగిసిన హనుమత్ దీక్షలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో దీక్ష విరమణలు, హనుమత్ జయంతి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో శుక్రవారం మధ్యాహ్నం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు రామకృష్ణ, శిష్యబృందం పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పీఠం కన్వీనర్, ప్రధాన కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాష్ పాల్గొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఆంజనేయ స్వామి వారి మూలవిరాట్‌కు తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దీక్ష విరమణలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదుగా భక్తులు దీక్షలను విరమించి, స్వామి వారికి ఇరుముడులను సమర్పించారు. పూర్ణాహుతి అనంతరం దుర్గాప్రసాద్ స్వామిజీ భక్తులను అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల ఆవరణలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. తెలంగాణ నుంచి భక్తులు దీక్షలను విరమించేందుకు పీఠానికి తరలివస్తూనే ఉన్నారు. పూజా కార్యక్రమాలలో ఆలయ నిర్వాహకులు ఓంకార్, రాంపిళ్ల చైతన్య పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న దుర్గాప్రసాద్

పర్సనల్ బ్రాంచ్ సందర్శన

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే పీసీపీఓ (ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్) సిద్ధార్థ్ కాటి శుక్రవారం విజయవాడ డివిజన్‌లోని పర్సనల్ బ్రాంచ్‌ను సందర్శించి అధికారుల పనితీరు, సిబ్బంది సంక్షేమంపై సమీక్షించారు. ముందుగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌ను కలుసుకుని విజయవాడ డివిజన్‌లోని హెచ్‌ఆర్ సంబంధిత విషయాలపై చర్చించారు. అనంతరం పర్సనల్ బ్రాంచ్ పనితీరుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ సీనియర్ డీపీఓ ప్రేమ్‌కుమార్ లకావత్ డివిజన్‌లో ఉద్యోగుల సంక్షేమం కోసం చేపట్టిన చర్యల గురించి వివరించారు. రైల్వే ఉద్యోగులకు అందిస్తున్న సేవను మెరుగుపర్చాల్సిందిగా పీసీపీఓ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మరణించిన ఉద్యోగుల విషయంలో సేవలను మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు సెటిల్‌మెంట్‌లను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం గుర్తింపు కలిగిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల సంఘాల నేతలతో మాట్లాడారు. విధుల్లో సిబ్బందికి ఎదురవుతున్న పలు సమస్యలపై యూనియన్ నేతలు అందించిన వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు హామీ ఇచ్చారు.



ఉద్యోగుల సంఘాల నుంచి వినతి పత్రాలు అందుకుంటున్న పీసీపీఓ సిద్ధార్థ్ కాటి

24 గంటలూ మద్యం విక్రయాలు!

పాయకాపురం(విజయవాడరూరల్): మద్యం విక్రయాలకు సంబంధించి ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమీషనర్ ఆదేశాలు కనుచూపు మేర కనిపించడం లేదు. మద్యం షాపుల్లో, బార్లలో సమయ పాలన లేకుండా నిబంధనలు తుంగలో తొక్కి మద్యం అమ్మకాలు 24 గంటలూ జరుగుతున్నాయి. శుక్రవారం నున్న పీఎస్ పరిధి వాంబే కాలనీ రోడ్డులో ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉదయం 7 గంటలకే మద్యం అమ్ముతున్నారు. ఆ మార్గంలోనే కాదు అన్ని బార్ అండ్ రెస్టారెంట్లలో షట్టర్లు క్లోజ్ చేసి ఉంచి సైడ్ డోర్ నుంచి విక్రయిస్తున్నారు. పర్మిట్ రూమ్‌లకు అనుమతులు లేకపోయినా పరదాల చాటున కుర్చీలు వేసి సిట్టింగ్ సదుపాయాలు ఏర్పాట్లు చేసి విక్రయాలను రెట్టింపు చేసుకొంటున్నారు. కండ్రిక పాతపాడు రోడ్డులో మద్యం షాపులో పరదా చాటున సిట్టింగ్ జరుగుతోంది. ఫోనులో ఆర్డర్ ఇస్తే డోర్‌డెలివరీ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ఇవన్నీ ఎక్సైజ్ అధికారులకు, పోలీసు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



పాతపాడు రోడ్డు మద్యం షాపు వద్ద పరదా ఏర్పాటు

ఎదురుదాడి చేయటం సిగ్గుచేటు

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంటిబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): టీడీపీ నేతలు, నాయకుల అవినీతిని పక్కా ఆధారాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయటపెడితే, కాదని సాక్ష్యాధారాలతో నిరూపించుకోవాల్సిన వారు ఎదురుదాడి చేయటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మద్యం అమ్మకాల్లో అవినీతి జరిగిందంటూ అక్రమ కేసులు బనాయించటం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని తెలిపారు. ఇప్పటికే మద్యం కుంభకోణం కేసులో బెయిల్‌పై ఉన్న చంద్రబాబు దాన్ని కప్పిపుచ్చుకునేందుకు తప్పులమీద తప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. తప్పు తెలుసుకున్న తరువాత మద్యం విషయంలో ఎవరూ నోరెత్తవద్దని మంత్రులు, నేతలకు వార్నింగ్ ఇచ్చిన చంద్రబాబు పక్క రాష్ట్రంలోని రాజకీయ నిరుద్యోగి గోనె ప్రకాశరావు, వేరే పార్టీలో ఉన్న షర్మిలతో ప్రెస్‌మీట్లు పెట్టించడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. కూటమి ఏడాది పాలనలో ప్రజలకు మేలు చేసిందేమీ లేదని తెలిపారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మినీ మహానాడు కార్యక్రమాలు అట్టర్‌ఫ్లాప్ అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్నందుకు సిగ్గుపడుతున్నానని టీడీపీ సీనియర్ నేత పబ్లిగ్గా ప్రకటించటం, ఎన్టీఆర్ జిల్లా మినీ మహానాడుకు ముగ్గురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి డుమ్మా కొట్టడం కంటే నిదర్శనం ఇంకేం కావాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ముగ్గురు ఎమ్మెల్యేలు నిలదీస్తున్నారంటే కూటమి పాలన ఎంత అధ్వానంగా ఉందో ప్రజలకు అర్థమవుతుందన్నారు.

అబ్దుల్ షకూర్‌కు నివాళి

వించిపేట(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సీనియర్ మైనారిటీ నాయకులు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ షకూర్ శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. రాజకీయ నేపథ్యం గల కుటుంబం నుంచి వచ్చిన ఆయన విజయ డెయిరీ పాలకేంద్రంలో ఉద్యోగరీత్యా ఐఎన్‌టీయూసీ అనుబంధ విభాగంలో పనిచేస్తూ అంచలంచెలుగా ఎదుగుతూ మాజీ మంత్రి ఎం.కె బేగ్ వద్ద పీఆర్వోగా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ నగర మైనార్టీ అధ్యక్షుడిగాను, మూడుసార్లు జిల్లా కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడిగాను, జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షులుగా పనిచేశారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషిచేశారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజవర్గం ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, వైఎసార్ సీపీ మైనారిటీ నాయకులు, పార్టీ నాయకలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేస్తే రేషన్ మాఫియాను అరికట్టవచ్చని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేషన్ బియ్యాన్ని ఇంటింటికి సరఫరా చేసే ఎండీయూ వాహనాలను రద్దు చేసినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన ప్రకటన చెట్టు ఎందుకు ఎక్కావు అంటే దూడ మేత కోసం అన్నట్లు ఉందని తెలిపారు. సన్నబియ్యం, మంచి బియ్యం రేషన్ కార్డుదారులకు సరఫరా చేస్తే రేషన్ మాఫియా దానంతటదే కనుమరుగవుతుందని వివరించారు. పురుగులు పట్టిన దొడ్డు బియ్యం, సరిగా ఉడకని కందిపప్పు, నాణ్యత లేని పంచదార సరఫరా చేస్తున్నారని తెలిపారు. కేజీ బియ్యం రూ.46లకు కొనుగోలు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతుందని, ఆ రేటుకు బ్రహ్మాండమైన సన్నబియ్యం కొనుగోలు చేసి సరఫరా చేయవచ్చని పేర్కొన్నారు. 'కూటమి' మంచి ప్రభుత్వం అయితే మంచి బియ్యం సరఫరా చేయాలని కోరారు. కందిపప్పు సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వార్డ్ స్పెషల్ ఆఫీసర్లూ.. సమస్యలను పరిష్కరించండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు వార్డులోని ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశ హాల్లో ఆయన వార్డ్ స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథరెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్స్ సంజయ్ రత్న కుమార్, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

చిన్నారుల మేధో వికాసానికి ఫన్ అండ్ లెర్న్



వేసవి శిబిరంలో చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ, నిర్వాహకులు



కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ఏర్పాటు చేసే ఉచిత శిబిరాల్లో ఫన్ అండ్ లెర్న్ వంటి కార్యక్రమాలు చిన్నారుల మేధో వికాసానికి దోహదపడతాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పేరాల అంకినీడు ఆధ్వర్యాన పటమట న్యూ ఆర్టీసీ కాలనీలోని మదర్‌థెరిసా మున్సిపల్ పార్క్‌లో చిన్నారులకు ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ శిబిరాన్ని ఏప్రిల్ 29న ప్రారంభించామని, ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు వివిధ క్రీడలతోపాటు క్విజ్, స్టోరీ టెల్లింగ్, చిత్రలేఖనం, క్రాఫ్ట్స్ తదితర అంశాలలో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు. సామాజిక నైపుణ్యాలను అలవాటు చేసేలా గ్రూప్ టాస్క్‌నుకూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వేసవి శిబిరంలో చిన్నారుల శారీరక, మానసిక వికాసాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్‌ను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన శిబిరం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వేసవి ఉచిత శిబిరం నిర్వాహకులు, సీఎంఓ అధికారి డి.శ్రీనివాసన్, రిజిస్ట్రేషన్ అండ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ జాయింట్ ఐజీ టి.సరోజ, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ఎన్ఎంయూ

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ప్రజా రవాణ సంస్థ (ఆర్టీసీ)లో ఉద్యోగులకు అండగా నిలబడి వారి సమస్యలను పరిష్కరించిన ఘనత ఎన్ఎంయూఏ (నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్)కే దక్కుతుందని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కే.ఏ.వీ శ్రీనివాసరాజు తెలిపారు. శుక్రవారం గవర్నరుపేట– 2 డిపో ఎదుట నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను పునరుద్ధరించాలని గత కొన్ని రోజులుగా చేపడుతున్న ఉద్యమానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, అమలుకు అంగీకరించిందన్నారు. దీంతో భరోసాతో ఉద్యోగం చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విధినిర్వాహణలో జరిగే తప్పులు, పొరపాట్లకు ఏపీ పనిష్మెంట్‌లు ఎంత వరకు ఇవ్వాలో ఈ సర్క్యులర్ నిర్దేశిస్తుందని, దీన్ని అధికారులు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జోనల్ కార్యదర్శి ఏవీ రామారావు, జిల్లా కార్యదర్శి సీహెచ్ రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

డ్రెయిన్, మెట్ల నిర్మాణ పనులకు శ్రీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 38వ డివిజన్ మల్లికార్జునపేట 113 వార్డ్ సచివాలయం పరిధిలోని ఆకులవారి వీధి, బాల రమణయ్యవారి వీధిలో డ్రెయిన్, మెట్ల నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండ ప్రాంతమైన ఆకులవారి వీధిలో ఎప్పుడో కట్టిన సైడు కాలువలు ధ్వంసమై మురుగునీరు చుట్టు పక్కల ప్రవహిస్తూ నానా అవస్థలు పడుతున్నట్లు స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అదే విధంగా కొండపై నివసిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజల రాకపోకలకు మెట్లు సరిగ్గా లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. నడక సక్రమంగా సాగని క్రమంలో కాలు మెలికపడి పనుల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం హయాంలో మంజూరయిన రూ.12 లక్షల వ్యయంతో ఈ రోజు పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, గురుమంత మహేష్, ఎస్ రాంబాబు, పలువురు స్థానికులు పాల్గొన్నారు.



డ్రెయిన్, మెట్ల నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టిన రెహమతున్నీసా

క్యూలైన్‌లో భక్తులకు సదుపాయాలు కల్పించాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు క్యూలైన్లలో అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని ఆలయ ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దుర్గగుడి ఈవో శీనానాయక్ శుక్రవారం మహా మండపంలోని అంతస్తులను తనిఖీ చేశారు. మహా నివేదన సమయంలో క్యూలైన్‌లో పెద్ద ఎత్తున భక్తులు వేచి ఉండటంతో వారికి దేవస్థానం కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. క్యూలైన్లలో మంచినీటి సదుపాయంతో పాటు సీలింగ్ ఫ్యాను పని చేసేలా చూడాలని సూచించారు. అదే విధంగా మరుగుదొడ్లను తరుచూ శుభ్రం చేయడంతో పాటు మార్గమధ్యలో చంటి పిల్లలకు పాలిచేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం మహా మండపం 5వ అంతస్తులోని పూజా సామగ్రి విక్రయించే దుకాణాలను పరిశీలించారు. పూజా సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని టోల్‌ఫ్రీ నెంబర్ చాంబర్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో నమోదు చేసుకున్న భక్తుల వివరాలను పరిశీలించడంతో పాటు సమాచారం కోసం ఫోన్ చేసిన భక్తురాలితో ఈవో మాట్లాడారు. ఆలయ సిబ్బంది దేవస్థాన సమాచారం మొత్తాన్ని అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈవో వెంట పలువురు ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహా మండపంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఈవో శీనానాయక్